'పది' పరీక్షలకు సన్నద్ధం

- వందశాతం ఫలితాలే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళిక
- నిత్యం గంటలపాటు అవగాహన
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు కృషి



మానవపాడులో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు (ఫైల్)

మానవపాడు: పదో తరగతి పరీక్షల నిర్వాహణకు మరో 40 రోజుల కాల వ్యవధి ఉన్న నైపథ్యంలో, ప్రైవేట్‌కు దీటుగా సర్కార్ బడుల్లో ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పదో తరగతే పునాది కావడంతో విద్యార్థులు మానసిక ఒత్తిడి గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నిత్యం రెండు గంటలపాటు ప్రత్యేక తరగతులు తీసుకోవడమే కాకుండా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సబ్జెక్ట్‌ల వారీగా అవగాహన కల్పిస్తూ వందశాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

మండలంలో ఇలా..

మండలంలోని మొత్తం మూడు హైస్కూల్స్ ఉండగా, కేజీబీవీ పాఠశాల ఉంది. వాటిలో 10వ తరగతి విద్యార్థులు 87, 45, 58, 57 ఉన్నారు. అన్ని సర్కార్ బడుల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ సన్నద్ధం చేస్తున్నారు.

భవిష్యత్‌కు పునాది..

విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించేది పదో తరగతి గతంలో పది పరీక్షలకు 11 పేపర్లు ఉండగా గత రెండేళ్ల నుంచి ప్రభుత్వం 7 పేపర్లు కుదించింది. ఒక్కో పేపర్ పరీక్ష నిర్వాహణ సమయం 3 గంటలు ఉంటుంది. ఇందులో బయోలజికి ఫిజిక్స్, కెమిస్ట్రీకి మాత్రమే గంటన్నర చొప్పున ఆయా సబ్జెక్ట్‌లకు 3గంటల సమయాన్ని విద్యార్థులు వినియోగించుకోవాల్సి ఉంటుంది.

ప్రత్యేక తరగతుల ఇలా..

విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం 8.30 నుంచి 9.30 గంటల పాటు సబ్జెక్ట్ వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3గంటలకు ఆ సబ్జెక్ట్‌పై పరీక్ష నిర్వహిస్తున్నారు. అదే విధంగా సాయంత్రం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు.. రోజు రెండున్నర గంటల ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించి సబ్జెక్ట్‌లపై అవగాహన ఇస్తున్నారు.

ఒత్తిడిని అధికమించాలి...

దీంతో ఉపాధ్యాయులు పాఠ్యాంశ బోధనే కాకుండా వారికి ప్రేరణ కలిగే విషయాలను చెబుతూ ఉత్తేజ పరుస్తున్నారు. ఈ ఏడాది ఎవరు పదికి పది మార్కులు సాధిస్తారో వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని ఆసక్తి కల్పిస్తున్నారు. ఆయా విద్యార్థుల సామర్థ్యలను బట్టి వారికి తగిన సలహాలు, సూజనలతో అవగాహన ఇస్తున్నారు. పరీక్షలపై భయం వీడి పాఠ్యాంశాలపై ఎలా దృష్టి సారించాలో అవగాహన సదస్సులు నిర్వహించి పరీక్షలపై భయాన్ని పోగొడుతున్నారు.

విద్యార్థులకు అల్పాహారం..

పది పరీక్షలకు సన్నద్ధమౌతున్న విద్యార్థుల సౌకార్యర్థం అల్పాహారం ఏర్పాటు చేస్తే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రుల వెల్లడించారు.

ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు..



ప్రభుత్వ పాఠశాలలోని బడుల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధించేందుకు ఉపాధ్యాయులు రోజుకు రెండు గంటల ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించి పరీక్షలు పెడుతూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతుల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

– పవన్, 10వ తరగతి జల్లాపురం

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.



10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. మండలంలో ఉత్తమ లక్ష్యలను చేరుకోవాలని ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా క్లాస్‌లను నిర్వహిస్తున్నారు. ప్రణాళిక బద్ధంగా తరగతి గదులను నిర్వహిస్తూ విద్యార్థులకు వచ్చే సందేహాలను తీరుస్తూ తరగతులను నిర్వహిస్తున్నారు.

– చంద్రకళ, జెడ్పీహెచ్ఎస్, మానవపాడు

ఉన్నత లక్ష్యం చేరుకోవాలి



మండలంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో లక్ష్యాన్ని నిర్ణయించాం. ఆ మేరకు లక్ష్యాన్ని చేరుకోవాలని హెచ్ఎంలను ఆదేశించాం. అందుకు తగ్గట్టుగానే ఉపాధ్యాయులు తమ ప్రయత్నాలు చేస్తూ.. ప్రత్యేక తరగతులపై దృష్టి సారిస్తున్నారు. ప్రైవేట్‌కు దీటుగా.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తాం.

– శివప్రసాద్, ఎంఈఓ మానవపాడు

క్షుప్తంగా

పుస్తకాల పంపిణీ



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం పిల్లల కోసం తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా జాతీయ సేవా పథకం వలంటీర్లకు పుస్తకాలు, బ్యాడ్జీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా మాట్లాడుతూ ప్రతి శనివారం పాఠశాలలకు వెళ్లి చదువులో వెనుకబడిన విద్యార్థులకు బోధన అందించిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్స్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీపతినాయుడు, అధ్యాపకులు మనోజ్‌కుమార్, పద్మ, జగన్మోహన్ ఉన్నారు.

డ్రైవర్లను తొలగించొద్దు



గద్వాల అర్బన్: గద్వాల మున్సిపాలిటీలో కొన్నేళ్లుగా పని చేస్తున్న చెత్త సేకరించే ఆటో డ్రైవర్లను తొలగించొద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి వీవీ నర్సింహ అన్నారు. ప్రైవేట్ వ్యక్తులకు కాంట్రాక్టు ఇస్తామని అధికారులు చెప్పడం సరైంది కాదని, ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ ముందు నిరసన వ్యక్తం చేశారు. చెత్తను సేకరించే డ్రైవర్లు తొలగిస్తామన్న కమిషనర్, అడిషనల్ కలెక్టర్ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని, లేదంటే కార్మికులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం స్థానిక సంస్థల కలెక్టర్, మున్సిపాలిటీలోని మేనేజర్‌లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు రాజేష్, శివ, నర్సింహ, మౌలాలి, గోవిందు, నర్సింహ ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రిక విడుదల



అయిజ: మండల కేంద్రంలో పునర్ నిర్మించిన గుంతరామలింగేశ్వర స్వామి ఆలయంలో త్వరలో నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను గురువారం ఆలయంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు రఘుస్వామి మాట్లాడారు. ఈనెల 12 నుంచి 14 వరకు విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహించనున్న ప్రతిష్ఠ కార్యక్రమం మంత్రాలయం పీఠాధిపతులు సుబుదేంద్ర తీర్థులు చేతుల మీదుగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు పేర్కొన్నారు.

విద్యార్థినికి ఆర్థికసాయం



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని పిల్లిగుండ్లకు చెందిన నందిని చదువుకునే స్తోమత లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నది. ఈ విషయం తెలుసుకున్న సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం సభ్యులు నందిని చదువు కోసం ఆర్థికంగా చేయూతనందించారు. హైదరాబాద్‌లో ఆర్ఆర్‌బీ కోచింగ్ కోసం రూ. 20వేల నగదు అందించారు. కష్టపడి చదువుకొని ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం సభ్యులు శ్రీలత, గాయత్రి, సుప్రీయ, కృష్ణవేణి, అశోక్, వెంకట్రాముడు ఉన్నారు.

చెత్త సేకరణకు ట్రాక్టర్ కరువాయె



మానవపాడు: కొన్ని రోజులుగా గ్రామాల్లో చెత్త సేకరణకు ట్రాక్టర్ కురువైంది. గ్రామాల్లోని నివాసగృహాల నుంచి తడి, పొడి చెత్తను తరలించేందుకు గ్రామాల్లో ట్రాక్టర్ ప్రధాన వాహనంగా ఉండేది. పారిశుద్ధ్య కార్మికుల ద్వారా సెగ్రిగేషన్‌షెడ్‌కు తరలించేవారు. మండల స్థాయి, జిల్లాస్థాయి అధికారుల నుంచి ట్రాక్టర్‌కు అనుమతి నిరాకరించడంతో గ్రామాల్లోని పారిశుద్ధ్య కార్మికుల ద్వారా చెత్త ట్రై సైకిళ్లతో తరలిస్తున్నారు. ట్రై సైకిళ్ల ద్వారా ప్రతి రోజు పారిశుద్ధ్య కార్మికులు రాలేక రెండు రోజులకో సారి వీధుల గుండా వస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో గతంలో మాదిరిగా ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరణ చేయాలని, యథావిధిగా ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరణకు అధికారులు అనుమతి ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడాస్ఫూర్తితో ఉన్నత శిఖరాలకు చేరాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వెంకట్రాములు

గద్వాల: ప్రతి క్రీడాకారుడికి క్రీడాస్ఫూర్తి ముఖ్యమని, దీని వల్లే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరవచ్చని బీజేపీ సీనియర్ నాయకుడు బండల వెంకట్రాములు అభిప్రాయపడ్డారు. రాష్ట్రస్థాయి సబ్–జూనియర్స్ కబడ్డీ పోటీల కోసం గురువారం స్థానిక తేరుమైదానంలో జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించారు. బాలుర, బాలికల జట్ల కోసం జిల్లా వ్యాప్తంగా 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు జాతీయస్థాయి పోటీలను లక్ష్యంగా నిర్దేశించుకొని ఆడాలని సూచించారు. ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని సూచించారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అబ్రహం మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని, అప్పుడే ఏ క్రీడలోనైనా రాణించవచ్చన్నారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు, మానసిక దృఢత్వం లభిస్తుందన్నారు. అంతకు ముందు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. బాలుర జట్టుకు 18 మందిని, బాలికల జట్టుకు 14 మంది క్రీడాకారులను రాష్ట్ర జట్టు కోసం ఎంపిక చేశారు. ఎంపికైన వారికి స్థానికంగా శిక్షణ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కోచ్ తిరుపతి, పీఈటీలు రజనీకాంత్, రాజేంద్ర, గౌరి, మంజునాథ్, సీనియర్ క్రీడాకారులు సర్వేష్‌రెడ్డి, మోహన్ బాబు, సురేష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



గద్వాల అర్బన్: పౌష్టికాహారంతోనే రక్తహీనతను నివారించవచ్చని ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గిరిబాబు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వెంకంపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకుకూరలు, గుడ్లు, పాలు తదితర పోషక విలువలున్న పదార్థాలను తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసమరన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



గద్వాల అర్బన్: విద్యుత్ మీటర్ రీడర్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లాకు వచ్చిన విద్యుత్ శాఖ సీజీఎం చక్రపాణికి వినతిపత్రం అందజేశారు. విద్యుత్‌శాఖలో 20ఏళ్లుగా పని చేస్తున్నామని తెలిపారు. మీటర్ రీడర్స్ కార్మికులకు పని భారం తగ్గించాలన్నారు. విద్యుత్ మీటర్ రీడర్స్ కార్మికులు పాల్గొన్నారు.

చేసిన పనులు గుర్తుండేలా చేస్తాయి



మాజీ సర్పంచు, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు: ప్రజా ప్రతినిధులుగా మనం ప్రజల కోసం చేసిన సేవలు, పనులు చిరకాలం గుర్తుంటాయని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అల్వలపాడులో గ్రామ సర్పంచు, వార్డు సభ్యుల పదవీ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మాజీ సర్పంచ్ వీరన్న గౌడ్‌తో పాటు వార్డు సభ్యులు, పారిశుద్ధ్య కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మావెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

16న సమ్మెను జయప్రదం చేయాలి



మల్దకల్: ఈనెల 16న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ కోరారు. గురువారం మల్దకల్‌లో రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ, కార్మిక సంఘం ఆధ్వర్యంలో 16న దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఆశా వర్కర్లు వైద్యాధికారులకు సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు గంగన్న, మహేందర్‌రాజ్, ప్రభుదాస్, సామేల్, మోష, సరస్వతి, కాంతమ్మ, నర్సమ్మ, సుజాత పాల్గొన్నారు.

బలహీన వర్గాల సంక్షేమమే బీజేపీ లక్ష్యం

- బీజేపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ నాగురావ్ నామోజీ



బిజ్వారంలో మాట్లాడుతున్న బీజేపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ నాగురావ్ నామోజీ

మల్దకల్: బడుగు బలహీన వర్గాల సంక్షేమమే బీజేపీ లక్ష్యమని క్రమశిక్షణ కమిటీ చైర్మన్ నాగురావ్ నామోజీ అన్నారు. గురువారం మండలంలోని బిజ్వారం గ్రామంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి నిరంతరం పాటు పడుతుందన్నారు. అభివృద్ధి చేసే బీజేపీ పార్టీకి ఈ పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు పట్టం కట్టాలన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు పాల్వాయి రాముడు, తిమ్మారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, తిరుపతిరెడ్డి, రఘు, రవీందర్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



గట్టు: మండలంలోని మల్లంపల్లి గ్రామ శివారులోని వాగు నుంచి గురువారం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. మల్లంపల్లి శివారులోని వాగులో చాగదోణకు చెందిన గుండ్ల నర్సింహులు తన ట్రాక్టర్‌తో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు దివాకర్, నాగరాజు అక్కడికి చేరుకొని ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

ఆత్మకూర్: మత్స్యకారులకు ప్రభుత్వం ద్వారా వలలు, బోట్లు, తెప్పలు ఇతర సామగ్రిని అందించాలని మత్స్య సహకార సంఘం రాష్ట్ర నాయకులు అశ్విన్‌కుమార్, పుట్ట బాలరాజు అన్నారు. గురువారం రామన్‌పాడ్ ప్రాజెక్టును సందర్శించిన రాష్ట్ర ఫిషరీష్ కమిషనర్ గోపి, కలెక్టర్ తేజస్ పవార్‌ను సత్కరించి వినతిపత్రం అందజేశారు. మదనాపురం నుంచి రామన్‌పాడు మీదుగా ఆత్మకూర్ వరకు బీటీ రోడ్డు నిర్మించాలని, రామన్‌పాడు గెస్ట్ హౌస్‌కు మరమ్మతు చేపట్టాలన్నారు.కార్యక్రమంలో డైరెక్టర్ మురళీకృష్ణ, ఏడీ రహ్మాన్ ఉన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఎర్రవల్లిచౌరస్తా: రహస్యంగా పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై గురువారం ఇటిక్యాల పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. ఎస్ఐ వెంకటేష్ కథనం మేరకు.. మండలంలోని వావిలాల గ్రామంలో తెల్లవారుజా మున పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీస్ సిబ్బంది దాడి చేశారు. ఈ దాడిలో పేకాడు తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.71,309 నగదు, మూడు ద్విచక్ర వాహ నాలు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మీసేవకు తాళం.. వైన్ షాపులో డ్యూటీ

- 'సాక్షి' పరిశోధనలో వెల్లడైన వాస్తవాలు

రాజోళి: 'మీసేవ లేక అవస్థలు' శీర్షికతో గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయా గ్రామాల నుంచి స్పందన మొదలైంది. శుక్రవారం మాన్‌దొడ్డి, పెద్దధన్వాడ, చిన్నధన్వాడ గ్రామాల వారు 'సాక్షి'కి పలు వాస్తవాలు తెలిపారు. మాన్‌దొడ్డిలో మీసేవ కేంద్రం నడుపుతున్న నిర్వాహకుడు స్థానికంగా ఉన్న వైన్స్ షాపులో డ్యూటీ చేస్తున్నాడని, ఆ డ్యూటీలో భాగంగా బాధ్యతాయుతమైన మీసేవ విధులను వదిలేశాడని తెలిపారు. గ్రామాల్లోని బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసేందుకు ఆటోలో వెళ్తున్నట్లు పేర్కొన్నారు. మీ సేవ కేంద్రం ద్వారా అందించాల్సిన సేవలను స్థానికంగా ఉన్న ఒక ప్రైవేట్ నెట్ సెంటర్ ద్వారా అందిస్తూ, తనకు మీ సేవ నిర్వాహణ కోసం ఇచ్చిన విలువైన సాంకేతికత పరికరాలను ప్రైవేట్ షాపులో పెట్టి, వారి దగ్గర నుంచి కమీషన్లు పొందుతున్నట్లు తెలిపారు. ఇదే అదునుగా ప్రైవేట్ షాపుల వారు ప్రజల నుంచి ఆయా దరఖాస్తులకు ఎక్కువ మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు అడిగితే మీసేవకు నెల మొత్తంలో కావాల్సిన లావాదేవీలు నడిపామని, అభ్యంతరం చెప్పేవారు ఎవరని ఎదురు ప్రశ్నిస్తూ.. మీసేవ కేంద్రాన్ని మూసి, మద్యం షాపులో దర్జాగా డ్యూటీ చేస్తున్నట్లు గ్రామస్తులు వాపోయారు. దీనిపై జిల్లాలోని మీసేవలకు సంబంధించిన ఈఎండీ శివకుమార్‌తో మాట్లాడగా.. 'మేము ఆయనతో మాట్లాడితే మీకు నెల మొత్తంలో జరగాల్సిన ఆన్‌లైన్ సేవలు జరుగుతున్నాయి కదా' అని చెప్తున్నాడని తెలిపారు. దీని కోసం తమ సిబ్బందిని గ్రామంలో విచారణ కోసం పంపుతున్నట్లు ఆయన తెలిపారు. సేవా కేంద్రాన్ని నిర్లక్ష్యంగా వదిలేసి, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ, ధనార్జనే ధ్యేయంగా అక్రమంగా బెల్టు షాపుల్లో మద్యం సరఫరా చేసేందుకు వెళ్తున్న సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మాన్‌దొడ్డి, పచ్చర్ల, పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ, నసనూరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మంత్రిని కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్



మంత్రిని సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో జెడ్పీ చైర్ పర్సన్ సరిత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సన్మానించారు. నడిగడ్డ ప్రాంతంలో వ్యవసాయ రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించేందుకు కృషి చేయాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

వివక్షను రూపుమాపిన చరిత్ర కేవీపీఎస్‌ది



కేవీపీఎస్ డైరీని ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

రాజోళి: కేవీపీఎస్ ఆవిర్భావం జరిగాక గ్రామాల్లో కుల వివక్ష రూపుమాపిందని తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ అన్నారు. మండల కేంద్రంలో గురువారం మండల ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కేవీపీఎస్ డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవీపీఎస్ ఆవిర్భావానికి ముందు గ్రామాల్లో జరిగిన కుల వివక్షను గుర్తు చేసుకోలేమని, గ్రామాల్లో ఎంతో మంది దళితులు వివక్షకు గురై గ్రామాల నుంచి బహిష్కరించబడ్డారన్నారు. అలాంటి వివక్షలను, తారతమ్యాలను దూరం చేసిన కేవీపీఎస్ ప్రస్తుతం ఎన్నో ఏళ్లుగా ఎన్నో విజయాలను సాధించి, ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకట రమణ, ఆర్ఐ శ్రీనువాసులు, మాజీ ఉప సర్పంచ్ గోపాల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దస్తగిరి పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



జమ్మిచేడులోని ప్రభుత్వ పాఠశాలలో విద్యాసామగ్రిని అందజేసిన ఎంఈఓ, ట్రస్ట్ సభ్యులు

గద్వాల అర్బన్: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని గద్వాల మండల విద్యాశాఖ అధికారి సురేష్ అన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రత్నసింహారెడ్డి ఆధ్వర్యంలో గురువారం జమ్మిచేడు, పూడురు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, మెటీరియల్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ సురేష్ హాజరై మాట్లాడారు. హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు ద్వారా విద్యార్థులకు మెటీరియల్ అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్లు పరమేశ్వర్‌రెడ్డి, కృష్ణయ్య, ట్రస్ట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొంకతి శ్రీకాంత్, ట్రెజరర్ కృష్ణవర్ధన్, సభ్యులు అశోక్ కుమార్ రెడ్డి, భీమన్న, వెంకటేష్ ఉన్నారు.

విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ

మల్దకల్: మండల కేంద్రంలోని హైస్కూల్ విద్యార్థులకు గురువారం హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహకులు పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జీ ఎంఈఓ కొండారెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు పదో తరగతి పరీక్షలో మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులకు హెల్పింగ్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహకులు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎంపీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ)జిల్లా ప్రధాన కార్యదర్శి జమ్మిచేడ్ కార్తీక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని ఎంపీఓ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పరశురాముడు, రవి, మద్దిలేటి, మహేష్, సుంకన్న, మద్దిలేటి, రాజు పాల్గొన్నారు.

క్రీడాకారులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి



మున్సిపల్ కమిషనర్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అయిజ: క్రీడలు శారీరక, మానసిక ఆనందాన్నిస్తాయని, క్రీడాకారులు నిరంతరం సాధన చేసి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ అన్నారు. తిక్కవీరేశ్వర స్వామి ప్రీమియర్‌లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రేష్ఠావలి ఆచారి, మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్, మేనేజర్ రాజేష్ కుమార్‌లకు శాలువాలు కప్పి షీల్డ్‌లను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, మేనేజర్లు క్రీడాకారులను ప్రోత్సహించారు.

ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



బాధిత కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: హైదరబాదులోని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్ఓసీని ఎమ్మెల్యే విజయుడు గురువారం అందజేశారు. అలంపూర్ మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన కమలమ్మ మోకాలు ఆపరేషన్ చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సీఎం సహాయ నిధి మోకాలు ఆపరేషన్ కోసం రూ. లక్ష ఎల్ఓసీ వచ్చినట్లు తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కమలమ్మ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఎల్ఓసీ అందజేశారు. వారితోపాటు నాయకులు రఘు రెడ్డి, నరేందర్ రెడ్డి, జహంగీర్, తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల అభివృద్ధి

గట్టు: కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని బీజేపీ సీనియర్ నాయకులు బల్గెర శివారెడ్డి అన్నారు. గావ్ చలో కార్యక్రమంలో భాగంగా ఇందువాసి, బోయలగూడెం గ్రామాల్లో బీజేపీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇందువాసి ఎంపీటీసీ సువర్ణమ్మ, నాయకులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని వేములలో బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న బల్గెర శివారెడ్డి